క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట వ్యవసాయ క్షేత్ర ప్రాంతాలు, బట్టుపల్లి రోడ్డు, న్యూశాయంపేట రైల్వే గేట్, రెండు పడక గదుల ఇళ్ల కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు, కాజీపేటలోని సిద్ధార్థనగర్, ఫాతిమా జంక్షన్, బాబు క్యాంపు ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెటర్నరీ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రమేష్

గీసుకొండ : పశువైద్యుల (వెటర్నరీ డాక్టర్ల) సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గీసుకొండ మండల పశువైద్యాధికారి వడ్డేపల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరంగల్‌లోని వెట్స్ హోంలో బుధవారం జిల్లా సంఘం ఎన్నికలు నిర్వహించారు.

కాంగ్రెస్ సోషల్ మీడియా హనుమకొండ కోఆర్డినేటర్‌గా దీపక్‌రెడ్డి



హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్‌గా హనుమకొండలోని ఎన్జీఓఎస్ కాలనీకి చెందిన కేతిడి దీపక్ రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు టీపీసీసీ సోషల్ మీడియా సెల్ కోఆర్డినేటర్ నవీన్ పెట్టెం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సరిగా పనిచేయని వారిని తొలగిస్తూ కొత్తగా 33జిల్లాలకు కొత్త వారిని నియమించినట్లు నవీన్ పేర్కొన్నారు.

వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా లక్ష్మి



కాశిబుగ్గ: కాంగ్రెస్ సోషల్ మీడియా వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా నగరానికి చెందిన సోమ లక్ష్మి నియమితులయ్యారు. పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ పట్టెం నవీన్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా పుత్ర గణపతి వ్రతం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో పుత్ర గణపతి వ్రతాన్ని భక్తులు బుధవారం వైభవంగా జరుపుకున్నారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో 108 జంటలు పుత్ర సంతానంతో పాటు తమ పిల్లలకు సద్బుద్ధితో పాటు విద్య, ఉద్యోగ, వ్యాపారాల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. పుత్ర గణపతి వ్రతం ఆచరించడం వల్ల కలిగే ఫలితాలను సాయికృష్ణ శర్మ భక్తులకు వివరించారు. అన్నపూర్ణ భవనంలో భక్తులకు అన్నదానం చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రవి, పీఆర్ఓ మణిదీప్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీ పోస్టులు భర్తీచేయాలి

కేయూ క్యాంపస్: మెడికల్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొటెక్షన్ ఫోరం వ్యవస్థాపకుడు అంబాల రాకేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ గేట్‌వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగులందరికి న్యాయం చేయాలని కోరారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత



మడికొండ: పోగొట్టుకున్న నగదును తిరిగి బాధితురాలికి మడికొండ పోలీసులు అప్పగించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పరకాల మండలం వెల్లంపల్లికి చెందిన పాలేటి వసంత.. మడికొండలో ఒక శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో మడికొండ చౌరస్తా వద్ద తన డబ్బులు ఉన్న సంచిని పోగొట్టుకుంది. ఆ సంచిని పోలీసులకు ఓ యువకుడు అప్పగించాడు. బాధిత మహిళ స్టేషన్‌కు రాగా, ఆ సంచిని ఆమెకు ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ అప్పగించారు.

హుండీ లెక్కింపుపై విచారణ జరిపించాలి



ఖిలా వరంగల్: శివరాత్రి సందర్భంగా స్వయంభూ శంభులింగేశ్వర దేవాలయంలోని హుండీల లెక్కింపుపై ఉన్నతాధికారితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకులు బెడిదే వీరన్న, సాగర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేటర్, ధర్మకర్తలకు సమాచారం ఇవ్వకుండా హుండీల్లోని డబ్బులను లెక్కించిన ఆలయ పూజారి, ఈఓను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. ఈమేరకు ఖిలా వరంగల్ మధ్యకోటలోని స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ప్రాంగణంలో నాయకులతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బోయిని దూడయ్య, శివాజీ, చంద్రమౌళి, ధర్మకర్త మండలి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పలు కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం



హన్మకొండ అర్బన్: సంబురాలు జరుపుకుంటున్న రెడ్డి సంఘం నాయకులు, తదితరులు



హసన్‌పర్తి: రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రెడ్డి, ఓసీ సంఘాల నాయకులు



వరంగల్ చౌరస్తా: సీఎం, కొండా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాపు సంఘం నాయకులు



వరంగల్: సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పద్మశాలి నాయకులు



రామన్నపేట: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య నేతలు, వాసవి క్లబ్ ప్రతినిధులు



కరీమాబాద్: కురుమ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మరుపల్ల రవి

హన్మకొండ అర్బన్: పలు కార్పొరేషన్ల ఏర్పాటుపై ఆయా కులసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి తెలిపారు. నగరంలోని సంఘం కార్యాలయంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ప్రకటనపై..

హసన్‌పర్తి: రెడ్డి కార్పొరేషన్ ప్రకటించడాన్ని రెడ్డి సంఘం, ఓసీ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎర్రగట్టు గుట్ట వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఓసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి, రెడ్డి సంఘం హసన్‌పర్తి అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే, సీఎం రేవంత్‌రెడ్డికి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీరాటి దేవేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌పై..

వరంగల్ చౌరస్తా: మున్నూరుకాపు కార్పొరేషన్ ప్రకటనపై ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వరంగల్ చౌరస్తాలో అధ్యక్షుడు కటకం పెంటయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు బండి కుమారస్వామి, కత్తెరశాల వేణుగోపాల్, మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు న్యాయం..

వరంగల్: రాష్ట్రంలోని పద్మశాలి కులస్తులకు న్యాయం చేసేందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు ఆడెపు రవీందర్ అన్నారు. ఈమేరకు గోపాలస్వామి గుడి జంక్షన్‌లో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై..

రామన్నపేట: ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేయడాన్ని హర్షిస్తూ ఆర్య వైశ్య సంఘం నేతలు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. వాసవి కాలనీలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరన్న, అవోపా వరంగల్, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కరీమాబాద్: కురుమల ఆత్మగౌరవం పెంపొందించేందుకు ప్రత్యేకంగా కురుమ కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఉర్సు కురుమసేవ భవన్‌లో కుల సంఘం నాయకుల సమావేశం జరిగింది.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా..



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

హన్మకొండ / హన్మకొండ అర్బన్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 60, 58వ డివిజన్ల పరిధిలోని హనుమకొండలోని వడ్డెపల్లి, ఎన్జీవోస్ కాలనీల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎన్జీవోస్ కాలనీలో రూ.40.25 లక్షలు, లక్ష్మీనగర్‌లో రూ.15.90 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు, రూ.12.50 లక్షల ఖర్చుతో చేపట్టనున్న ముదిరాజ్ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించారు. అలాగే, వడ్డెపల్లిలోని ఐ లవ్ వడ్డెపల్లి ఫౌంటెన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, నాయకులు ఎనుకంటి పున్నం, ఎనుకంటి నాగరాజు, శ్రవణ్, బంక సంపత్‌యాదవ్, తాళ్లపల్లి విజయ్, మహమ్మద్ ముస్తాక్ నేహాళ్, తాళ్లపల్లి మేరీ, మండల సమ్మయ్య, శ్రీలక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాగేశ్వర్ రావు, జాషువా, మురళి, లలిత భాస్కర్, అహ్మద్ పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో అధికారులు, ముస్లిం పెద్దలు

వరంగల్: రంజాన్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్వో శ్రీనివాస్, డీఎంఓ సౌజన్య అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మసీదులు, ఈద్గాల్లో మౌలిక వసతుల కల్పించాలని సూచించారు. పోలీసు, జీడబ్ల్యూఎంసీ, ఇతర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ రంజాన్ మాసంలో అన్ని రేషన్ షాపుల్లో గోధుమలు, పంచదార, వంటనూనె, బియ్యం ఎక్కువగా సరఫరా చేయాలని, నీటి సరఫరా మరో అరగంట పాటు పెంచాలని, సాయంత్రం నాలుగు గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఆర్టీసీ బస్సులను మండిబజార్ నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో నడిపించాలని కోరారు. పేద ముస్లింలకు ఇచ్చే బట్టలు(తోఫా)లను ముందుగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ముస్లిం పెద్దలు మహ్మద్ అయూబ్, చాంద్‌పాషా, తన్వీర్, రాజ్‌మహ్మద్, షకీల్, నయీం, షాకిర్, జీడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్ రషీద్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, ఏసీపీ నందిరాం నాయక్, సీఎంహెచ్ఓ రాజేష్ పాల్గొన్నారు.

సహృదయ రంగస్థల పురస్కారం ప్రదానం



పురస్కారం ప్రదానం చేస్తున్న సంస్థ సభ్యులు

హన్మకొండ కల్చరల్: మైమ్ (ముఖాభినయం) కళను తన ఇంటిపేరుగా మార్చుకుని దేశ, విదేశాల్లో తన ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్న ముఖాభినయ కళాకారుడు మైమ్ మధుకు సహృదయ రంగస్థల పురస్కారాన్ని వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అందజేసింది. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నాలుగు రోజులుగా జరుగుతున్న తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజా మనోహరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేదాంతం నరహరి ఆచార్యులు కాంతమ్మ స్మారకంగా మైమ్ మధుకు సహృదయ రంగస్థల పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి కుందావఝ్జల కృష్ణమూర్తి, సాంస్కృతిక కార్యదర్శి వనం లక్ష్మీకాంతారావు, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్వీఎన్ చారి, మల్యాల మనోహర్, న్యాలకొండ భాస్కర్‌రావు, కళా రాజేశ్వర్, సభ్యులు జూలూరు నాగరాజు, సీతవెంకట్, ఆకుల సదానందం, గూడూరు బాలాజీ, నాగిళ్ల రామశాస్త్రి, తిరుమలయ్య పాల్గొన్నారు.

విధ్వంస రాజకీయాలు మానుకోండి



మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేశ్వర్ రావు

హన్మకొండ: కాంగ్రెస్, బీజేపీ నాయకులు విధ్వంస రాజకీయాలు మానుకోవాలని బీఆర్ఎస్ కార్పొరేటర్లు హితువు పలికారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు ఇమ్మడి లోహిత, సంకు నర్సింగ్, చెన్నం మధుసూదన్, సోదా కిరణ్‌తో కలిసి కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రూ.వేల కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. వాటికి ఇప్పుడు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. వడ్డెపల్లిలో గతంలో దాస్యం వినయ్‌భాస్కర్ శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసి తిరిగి ఆ పనులకే ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, నయీమొద్దీన్, కనకరాజ్, ఖలీల్, శ్రీకాంత్ చారి, కల్యాణ్, ప్రభు, చిన్నా, ఇస్మాయిల్ ఉన్నారు.

లక్ష్యంతో చదివితే విజయం తథ్యం



హసన్‌పర్తి: పరీక్ష సామగ్రి అందజేస్తున్న సీపీ

హసన్‌పర్తి: లక్ష్యంతో చదివితే విజయం తథ్యమని నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అన్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. హసన్‌పర్తి పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఎంఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ పరీక్షలు అంటే కంగారు పడొద్దని, ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ తిరుమల్, హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, మండల విద్యాశాఖ అధికారి రామకిషన్ రాజు, ఎస్సైలు అశోక్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

మామునూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చక్కగా చదువుకోవాలని కేయూ వ్యాయామ అధ్యాపకుడు సోల్తి కిరణ్, ఓరుగల్లు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహక కన్వీనర్ మచ్చిక రాజు సూచించారు. వరంగల్ 17వ డివిజన్ బొల్లికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో దొంతి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో పదో తరగతి విద్యార్థులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెట్రిక్ బాక్స్‌లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పిండి ఆనంద్ బాబు, టీచర్లు శ్రీధర్, రవి, కుమార్, శివాజీ, జయశ్రీ, చందన, ఏఎంసీ మాజీ చైర్మన్ కేదారి, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో యూనియన్లు ఏర్పాటు చేయండి



హన్మకొండ చౌరస్తా: పాడి రైతుల సహకార సంఘాలతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యూనియన్లు ఏర్పాటు చేయాలని విజయ కాకతీయ పాడి రైతుల సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా బాధ్యులు కోరారు. ఈమేరకు హైదరాబాద్ సోమాజీగూడలోని కార్యాలయంలో విజయ డెయిరీ ఎండీ లక్ష్మిని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతుల భాగస్వామ్యంతో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ సహకార సమాఖ్య నిర్వహణలో రైతులను భాగస్వాములను చేయడం లేదని వాపోయారు. వినతిపత్రం అందజేసిన వారిలో దేవేందర్‌రావు, సమ్మయ్య, నరేంద్ర, మహేందర్ ఉన్నారు.

కేంద్ర బలగాల కవాతు

వరంగల్ క్రైం: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్ట్యా సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాళోజీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు కేంద్ర బలగాలు బుధవారం కవాతు నిర్వహించాయి. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఎస్సైలు గలీబ్, సాంబయ్య, సుమన్, రవికిరణ్, సిబ్బంది, సీఆర్పీఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ

కాశిబుగ్గ: నగరంలోని ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ సూచించారు. రోడ్డు సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ జంక్షన్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తమ ఆటోలకు సంబంధించిన పత్రాలతో పాటు విధిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఆటోలను నిలపకుండా నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, సురక్షితంగా వారిని గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. మద్యం తాగి ఆటోలు నడిపితే ఆటోలు సీజ్ చేసి జైలుకు పంపించనున్నట్లు తెలిపారు. ఆర్ఎస్సై పూర్ణచంద్రారెడ్డి, భానుప్రకాష్, శ్రవణ్, ఆటో అడ్డాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉపాధికి ‘వికసిత్ భారత్’



మాట్లాడుతున్న కృష్ణకాంత్

కాజీపేట అర్బన్: యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ -2047కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారని హైదరాబాద్‌లోని సెమీకండక్టర్ల ఉత్పత్తి పరిశ్రమ ఓస్రామ్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ ఏజీ.కృష్ణకాంత్ తెలిపారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఇండియాస్ టెకొహెడ్ - చిప్స్ ఫర్ వికసిత్ భారత్ -2047 అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో కృష్ణకాంత్ మాట్లాడారు. పీహెచ్‌డీ విద్యార్థులు సెమీ కండక్టర్లపై పరిశోధనలు చేపట్టి పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ప్రొఫెసర్లు వేణుమాధవ్, శ్రీనివాసాచార్య, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే అట్రాసిటి కేసులా?



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

న్యూశాయంపేట: హాస్టల్‌లో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తే అట్రాసిటి కేసులు బనాయిస్తారా అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. హనుమకొండ బాలసముద్రంలో బుధవారం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేల్పుల చరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థి సంఘం నాయకుడికి భీమారం బీసీ స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్ వార్డెన్ అపరిచిత వ్యక్తులతో ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడటం ఎంత వరకు సమంజసమని అన్నారు. సమావేశంలో నాయకులు అన్వర్, హరీష్, సంతోష్, వినయ్ పాల్గొన్నారు.

‘అనాథ’కు ఆశ్రమ నిర్వాహకుల అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మహ్మద్ చోటు

ఎంజీఎం / కాజీపేట : మట్టెవాడకు చెందిన జారతి భద్రయ్య(75) వికలాంగుడు కావడంతో అతనికి వివాహం కాలేదు. ఉమ్మడి ఆస్తిలో వాటా ఇవ్వకుండా భద్రయ్యను అతని సోదరుడు వీరమల్లు కుమారుడు కిషోర్ ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. 2017, ఏప్రిల్ 24న స్థానికుల సమాచారం మేరకు హనుమకొండ ప్రశాంతనగర్‌కు చెందిన సహృదయ ఆశ్రమ నిర్వాహకులు చేరదీసినట్లు నిర్వాహకులు మహ్మద్ చోటు తెలిపారు. ఈక్రమంలో అనారోగ్య సమస్యలతో భద్రయ్య బుధవారం మృతి చెందగా సమాచారాన్ని బంధుమిత్రులకు అందించారు. అతడితో తమకు ఎలాంటి సంబంధం లేదని వారు అనడంతో వృద్ధుడి అంత్యక్రియలను ఆశ్రమ నిర్వాహకులు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.

సంక్షిప్తంగా

గీత కార్మికులందరికీ పింఛన్ ఇవ్వాలి

కాజీపేట: తాటి చెట్లనే నమ్ముకుని అతి కష్టం మీద జీవనం సాగిస్తున్న అర్హులైన గీత కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ డిమాండ్ చేశారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో సంఘం సభ్యులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల కోసం అర్హులు ఆతృతగా ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మోడెం రాజేందర్, మోడెం సురేందర్, కుమారస్వామి, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కరీమాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని హైదరాబాద్‌లో బుధవారం ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, కస్తూరి వెంకట్, వేణుగోపాల్, హేమనాయక్, సదానందం, కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, మురళీధర్‌రెడ్డి, రాజు, ప్రమీలావతి, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి, రామకృష్ణ, మధు, సునీతనాయర్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ఉపాధ్యక్షుడు ఆరెపల్లి శ్రీనివాస్, కార్యదర్శి బక్క దానయ్య కోరారు. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సీఎండీకి అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను అందించారు. తెలంగాణ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ఉపాధ్యక్షులు ఉపేందర్, రౌతు రమేష్ కుమార్, రామస్వామి, కోశాధికారి డి.స్వదేశ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తౌర్య, నాయకులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధి నిర్ధారణ శిబిరం

కాశిబుగ్గ: వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఉచిత షుగర్ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. డయాబెటిక్ స్పెషలిస్ట్, ఫిజీషియన్ డాక్టర్ అజిత్ మహమ్మద్ పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు చేశారు. సంరక్ష ఎండీ డాక్టర్ శ్రవణ్‌కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ మోహన్‌రావు సిబ్బంది సురేష్‌కుమార్, రవి, నీరజ, శ్రీదేవి, రవి, రమేష్, సుమలత, సారిక, రమాదేవి పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి గుడికి ద్వారం ఏర్పాటు

మామునూరు: వరంగల్ తిమ్మాపురం శివారు బెస్తం చెరువు సమీపంలో గంగమ్మ తల్లి దేవాలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో వేద పండితుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన ద్వార పూజను బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతికి సంతాపం

హన్మకొండ: వరంగల్ -2 డిపోకు చెందిన మేర్గు సంపత్ మృతికి నేషనల్ మజ్దూర్ యూనియన్ వరంగల్ రీజియన్ కార్యదర్శి సీహెచ్.యాకస్వామి సంతాపం తెలిపారు. విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం బాధాకరమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కారుణ్య నియామకం కింద ఆర్టీసీలో డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరారని గుర్తుచేశారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

హసన్‌పర్తి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల జన్మదిన వేడుకలను నగరంలోని ఒకటవ డివిజన్ ఎర్రగట్టు వద్ద బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, నంది శ్రీనివాస్, మూల దేవేందర్, కోడెల ప్రవీణ్, శ్రీకాంత్, రాకేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు దేవస్థాన ఉత్సవ కమిటీ నియామకం

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి దేవస్థాన ఉత్సవ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్సవ కమిటీ సభ్యులుగా ఆరెల్లి వెంకటస్వామి, వేల్పుల సదానందం, పెద్దమ్మ సురేష్, మూల నరోత్తంరెడ్డి, సాయిచరణ్ పటేల్, అశోక్‌కుమార్, సంగాల ప్రశాంత్‌కుమార్, చల్లా సుమంత్ యాదవ్, అటికం శ్రీనాథ్‌గౌడ్, కనపర్తి రాజు, జన్ను శైలజ, వింజమూరి రమణ, ఆరుట్ల శ్రీనాథాచార్యులు, వేదాంతం పార్థసారథిని నియమించింది.

మహిళా కార్పొరేటర్లకు క్రీడాపోటీలు



షటిల్ ఆడుతున్న కార్పొరేటర్లు

వరంగల్ అర్బన్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్ ఇండోర్ స్టేడియంలో మహిళా కార్పొరేటర్లకు పలు క్రీడా విభాగాల్లో బుధవారం పోటీలు నిర్వహించారు. క్యారమ్స్ సింగిల్స్, డబుల్స్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ చెస్, టగ్ ఆఫ్ వార్, రంగోలి, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించినట్లు అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ వివరించారు.